క్లుప్తంగా

5న నందెన్న, గౌరమ్మ ఉత్సవాలు

వజ్రపుకొత్తూరు రూరల్: ఉత్సవాలు గ్రామ ఐక్యతకు ప్రతీకగా నిలుస్తాయని సీతాపురం సర్పంచ్ తమ్మినాన ఢిల్లీరావు అన్నారు. గ్రామస్తులతో బుధవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాడి పంటల కల్పవల్లిగా కొలువుదీరిన నందెన్న, గౌరమ్మ ఉత్సవాలను వచ్చే నెల ఐదో తేదీన జరిపేందుకు తీర్మానం చేశారు. గ్రామపెద్దలు టి.అప్పారావు, టి.గోపాలరావు, హెచ్.అప్పలస్వామి, వై.రాజారావు,టి.రామయ్య, యూ.క్రిష్టారావు, హెచ్.గోపాల్‌క్రిష్ణ, వై.కాళిదాసు,జి.ధర్మారావు, నర్సింహులు, శేఖర్, భాస్కరరావు ఉన్నారు.

జంగిల్ క్లియరెన్స్

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ ఒకటో వార్డు పరిధిలో దత్తాత్రేయనగర్ నెమలి కొండ ప్రాంతంలో దత్తాత్రేయ నగర్ అభివృద్ధి కమిటీ అధ్వర్యంలో బుధవారం పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. పలాస నుంచి నెమలికొండ వరకు ఉన్నటువంటి రోడ్డుకు ఇరువైపులా నిండిపోయిన పొదలను జేసీబీతో క్లియర్ చేశారు. కమిటీ సభ్యులు సవర జగన్నాయకులు, సాయి సంతోష్, ప్రకాష్, యుగంధర్, దత్తత్రామ స్వాములు పాల్గొన్నారు.

ఎండల మల్లికార్జున దేవస్థానం ఈవోగా గురునాథరావు

టెక్కలి: రావివలస ఎండల మల్లికార్జునస్వామి దేవస్థానం ఈవోగా (ఎఫ్ఏసీ) జి.గురునాథరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకూర్మం దేవస్థానం ఇన్‌చార్జి ఈవోగా వ్యవహరిస్తున్న ఈయనకు ఎండల మల్లన్న దేవస్థానం ఎఫ్ఏసీ బాధ్యతలను ఉన్నతాధికారులు అప్పగించారు.

వలస కూలీ మృతి!



గణపతిరావు (ఫైల్)

టెక్కలి రూరల్: టెక్కలి మండలం లింగాలవలస పంచాయతీ సార్లిగాం గ్రామానికి చెందిన వలస కూలీ కూన గణపతిరావు హైదరాబాద్‌లో గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు బుధవారం తెలిపారు. బతుకుతెరువు కోసం హైదరాబాద్ వెళ్లిన ఆయన భవనాలకు పెయింటింగ్ వేసే పనులు చేసుకుంటూ వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. గణపతిరావు మృతి చెందినట్లు సమాచారం రావడంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని స్వగ్రామానికి గురువారం తీసుకురానున్నట్లు చెప్పారు.

తిలక్ పరామర్శ



షణ్ముఖరావును పరామర్శిస్తున్న తిలక్

నందిగాం: శివరాంపురం పంచాయతీ ముజ్జాడ గ్రామానికి చెందిన సీపాన అప్పన్నమ్మ ఇటీవల మృతి చెందారు. దీంతో ఆమె అల్లుడు.. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు అట్టాడ షణ్ముఖరావు కుటుంబసభ్యులను టెక్కలి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పేరాడ తిలక్ బుధవారం పరామర్శించారు. అప్పన్నమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, చిన్ని జోగారావుయాదవ్, మళ్ల సీతారాం, సీపాన ధర్మారావు, సనపల ప్రసాద్ ఉన్నారు.

డొంకూరులో పారిశుద్ధ్య పనులు



పారిశుద్ధ్య పనులు పర్యవేక్షిస్తున్న కార్యదర్శి కృష్ణ

సాక్షి ఎఫెక్ట్...

ఇచ్ఛాపురం రూరల్: డొంకూరు మత్స్యకార గ్రామంలో అధికారులు ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టారు. పారిశుద్ధ్యం లోపించిందంటూ 'అంగన్‌వాడీ చెంతనే మురుగు' శీర్షికన ఈ నెల 22వ తేదీన సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. బుధవారం పంచాయతీ కార్యదర్శి పొక్లయినర్ సహాయంతో గ్రామంలో మురుగును తొలగించి బ్లీచింగ్‌చల్లారు.

టీచర్ అవతారమెత్తిన ఆయమ్మ



తరగతి గదిలో ఆయమ్మ

ఇచ్ఛాపురం రూరల్: చిన్నారులకు విద్యా బుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయులు వ్యక్తిగత పనులపై బయటకు వెళ్లడంతో పాఠశాలలో పారిశుద్ధ్యం పనులు చేయాల్సిన ఆయమ్మ టీచరమ్మ అవతారం ఎత్తింది. ఇచ్ఛాపురం మండలం ముచ్చింద్ర పంచాయతీ బెన్నుగానిపేట ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. బుధవారం మధ్యాహ్న భోజనాలు అనంతరం ఓ ఉపాధ్యాయుడు మందులు తేవడానికి బరంపురం వెళ్లారని, మరో ఉపాధ్యాయుడు ఇచ్ఛాపురంలో జరిగే శుభ కార్యానికి వెళ్లడంతో తాను విద్యార్థులకు కాపలాగా ఉంటున్నానంటూ ఆయమ్మ కన్నమ్మ తెలిపారు. ఈ విషయమై ఎంఈఓ కురమాన అప్పారావు వద్ద ప్రస్తావించగా.. సంబంధిత ఉపాధ్యాయులు బయటకు వెళ్తున్నట్లు ఎటువంటి సమాచారం తెలపలేదని చెప్పారు.



అర్ధాంతరంగా వదిలేశారు..

నౌపడ నుంచి వెంకటాపురం వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్‌లో సీతానగరం జంక్షన్ నుంచి ఉయ్యాలపేటకు వెళ్లే రహదారికి మోక్షం ఎప్పుడని ప్రజలు ఎదురుచూస్తున్నారు. సుమారు రెండు కిలోమీటర్లు మెటల్ వేసి వదిలేయడంతో ద్విచక్ర వాహన చోదకులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ఈ రహదారి గుండా ప్రయాణించి పలువురు ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలు బారిన పడ్డారు. అధికారులు స్పందించి రహదారి నిర్మాణం పూర్తి చేయాలని పరిసర ప్రాంత ప్రజలుఉ కోరుతున్నారు.

–సంతబొమ్మాళి



నిలిచిన ట్రాఫిక్..

టెక్కలి నుంచి గుణ్‌పూర్ వెళ్లే రైలు మార్గంలో రెండు రోజులుగా సీతాపురం గ్రామ సమీపంలో రైల్వేట్రాక్ మరమ్మతులు చేపడుతున్నారు. దీంతో సీతాపురం నుంచి బోరిగిపేట వెళ్లే రహదారి మధ్యలోని రైల్వేగేట్ వేసి ట్రాక్ పనులు నిర్వహిస్తుండటంతో రెండు రోజులుగా వాహనాలు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. బుధవారం చాలా సమయం పనులు చేపట్టడంతో వాహనాలు రోడ్డుపైనే నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పనులను రాత్రి సమయంలో చేసుకుంటే మంచిదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

–టెక్కలి రూరల్



దారి ఇలా..వెళ్లేది ఎలా?

ఇచ్ఛాపురం మండలం కేదారిపురంలోని రోడ్డు అధ్వారంగా మారింది. గ్రామ సచివాలయానికి, రైతు భరోసా కేంద్రానికి, అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లడానికి ఇదే రహదారి. అటువంటి రహదారి పూర్తిగా మురికి కూపంగా మారడంతో కార్యాలయాల సిబ్బంది, రైతులు, లబ్ధిదారులు, చిన్నారులు పలు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ సిబ్బంది స్పందించి రహదారికి అడ్డంగా పారుతున్న మురికినీటిని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

–ఇచ్ఛాపురం రూరల్



రక్త పరీక్షల విభాగం వద్ద నేలపైనే పడిగాపులు కాస్తున్న రోగులు, వారి సహాయకులు

పెద్దాస్పత్రిలో సదుపాయాలు నిల్..

టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స కోసం వచ్చే రోగులు సదుపాయాలు లేక ఇబ్బంది పడుతున్నారు. అత్యవసర సేవల కోసం వచ్చే రోగులకు వీల్ చైర్‌లు లేకపోవడంతో బంధువుల సాయంతో లోపలకు వెళ్లాల్సిన పరిస్థితి దాపురిస్తోంది. వివిధ చికిత్స విభాగాల వద్ద ఎటువంటి బెంచీలు లేకపోవడంతో నేలపైనే పడిగాపులు కాయాల్సిన దుస్థితి చోటు చేసుకుంటోంది. దీంతో పేరుకే పెద్దాస్పత్రి తప్పా కనీస సదుపాయాలు లేవంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

–టెక్కలి



వీల్ చైర్ లేకపోవడంతో బంధువు సాయంతో లోపలకు వెళ్తున్న మహిళ

అస్తవ్యస్తంగా ట్రాఫిక్!



కొత్తపేట జంక్షన్‌లో ట్రాఫిక్‌లో ఇరుక్కున్న లారీలు

- కొత్తపేట నుంచి కోటబొమ్మాళి రైతుబజార్ వరకూ నిలిచిపోతున్న వాహనాలు
- పార్కింగ్ స్థలం లేక రోడ్డుపైనే వాహనాల పార్కింగ్

కోటబొమ్మాళి: జిల్లాలో ప్రముఖ వ్యాపార కేంద్రంగా పేరుగాంచిన కోటబొమ్మాళి మండల కేంద్రంలో రోజురోజుకూ ట్రాఫిక్ సమస్య ప్రజలను వెంటాడుతోంది. జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న కొత్తపేట జంక్షన్ నుంచి కోటబొమ్మాళి రైతుబజార్ వరకూ నిత్యం ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. కొత్తపేట అండర్‌పాస్ బ్రిడ్జిని ఆనుకొని ఉన్న ఆర్టీసీ బస్టాండ్ వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ జంక్షన్ నిత్యం వాహనాలతో రద్దీగా ఉండటం, ఇక్కడ పార్కింగ్ స్థలం లేక రోడ్డుపైనే వాహనాల పార్కింగ్ చేస్తుండటం, మూలపేట పోర్టుకు భారీ వాహనాలు ఈ జంక్షన్ మీదుగానే రాకపోకలు చేస్తుండడంతో నిత్యం ట్రాఫిక్ నిలిచిపోతుంది. దీంతో నడచివెళ్లేవారు, వాహనదారులు అనేక విధాలుగా ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. అలాగే కోటబొమ్మాళి రైతుబజార్ వద్ద కూడా ట్రాఫిక్ సమస్య వెంటాడుతోంది. నిత్యం ట్రాఫిక సమస్యన తలెత్తుతున్నప్పటికీ ఇక్కడ కనీసం హెచ్చరిక బోర్డులు కూడా అధికారులు ఏర్పాటు చేయలేదు. ట్రాఫిక్ నియంత్రణ కోసం కానిస్టేబుల్‌ను కూడా ఉంచడం లేదు. దీంతో ఎవరికి నచ్చినట్లు వారు వెళ్తుండడంతో పరిస్థితి గందరగోళంగా ఉంటుంది. ఇంత జరుగుతున్నా స్థానిక పోలీసులు ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి సారించడం లేదనే విమర్శలను స్థానికుల నుంచి ఎదుర్కొంటున్నారు.ఇప్పటికైన పోలీసులు దృష్టిసారించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

అవస్థలు పడుతున్నాం..



కొత్తపేట నుంచి కోటబొమ్మాళి రైతుబజార్ వరకూ ట్రాఫిక్ సమస్య నిత్యం వేధిస్తోంది. కొత్తపేటలో వాహనాలు నిలిచిపోతుండటంతో జనం ఇబ్బంది పడుతున్నారు. పార్కింగ్ స్థలం లేకపోవడంతో రోడ్లపైనే వాహనాలను నిలిపి వేయాల్సి వస్తుంది. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి.

–దండాసి సింహాచలం, వాహన చోదకుడు, కోటబొమ్మాళి

సమస్య పరిష్కరిస్తాం



కొత్తపేట నుంచి కోటబొమ్మాళి రైతుబజార్ వరకూ ట్రాఫిక్ సమస్య ఉంది. ముఖ్యంగా కొత్తపేటలో అధికంగా సమస్య ఉన్నట్లు గుర్తించాం. నేను ఇటీవలే బాధ్యతలు స్వీకరించాను. కొద్దిరోజుల్లో ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక డ్రైవ్ చేపడతాం. పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేస్తాం. అవసరమైన కూడళ్లలో ట్రాఫిక్ సిబ్బందిని ఉంచుతాం.

–వి.సత్యన్నారాయణ, ఎస్‌ఐ, కోటబొమ్మాళి

సమన్వయంతోనే సుస్థిర ప్రగతి

కవిటి: వ్యవసాయ అనుబంధశాఖల పరస్పర సమన్వయంతోనే రైతులు సుస్థిరప్రగతి సాధించగలరని కవిటి ఎంపీపీ కడియాల పద్మ అన్నారు. శిలగాంలో వ్యవసాయాధికారి బడగల దుర్గాప్రసాద్, ఉద్యాన శాఖాధికారిణి పోలాకి మాధవీలత ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముందుగా వరి పైర్లను అధికారులు పరిశీలించారు. సమగ్ర ఎరువుల యాజమాన్యం, సస్య రక్షణ విధానాలను వివరించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కడియాల ప్రకాష్, టీడీపీ నాయకుడు బి.సర్వేశ్వరరావు, కొర్రాయి గోపాల్, పూడి లక్ష్మణరావు, బి రమేష్ పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

పలాస: రైతులు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని పలాస వ్యవసాయ విస్తరణాధికారి పోలారావు చెప్పారు. బొడ్డపాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. ఉద్దానం ప్రాంతంలో ఎక్కువ శాతం జీడి మామిడి రైతులు ఉన్నారని వారంతా ఇదే నెలలో తోటలను సాగు చేసేటప్పుడు ఎటువంటి చర్యలు చేపట్లాలో వివరించారు. ఉద్యానవన శాఖ అధికారి శంకర్‌దాస్, ఏఈవో పావనీ, స్థానిక రైతు సంఘ నాయకులు కిక్కర ఢిల్లీరావు, మురిపింటి కుమార్రాజ్, గర్తం తులసీరావు, దుష్యంత్, సచివాయలం ఉద్యోగులు పాల్గొన్నారు.

తెగుళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఇచ్ఛాపురం రూరల్: ప్రస్తుతం వరి పొట్ట దశకు చేరుకుంటున్న నేపథ్యంలో తెగుళ్ల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని సోంపేట వ్యవసాయ ఉప సంచాయలకులు జగన్మోహనరావు అన్నారు. తేలుకుంచిలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడారు. పొడ, అగ్గి తెగులు, దోమ పోటు సోకినట్లు తమ పర్యవేక్షణలో వెల్లడైందని అన్నారు. నివారణ చర్యలను వివరించారు. వ్యవసాయాధికారి టి.భార్గవి, సర్పంచ్ పాతిర్ల రాజశేఖరరెడ్డి, సూర్యనారాయణ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

కాశీబుగ్గ: మందస మండలం బెల్లుపటియా గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఎంఈవోలు ఎం.లక్ష్మణరావు, ఎం భాస్కరరావు బుధవారం సందర్శించారు. విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పాఠశాలను సందర్శించిన అధికారులు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. వెజ్ బిర్యానీకి వాడిన బియ్యం ఉడకుండా ఉండటాన్ని గుర్తించారు. పిల్లలకు దుంపల కుర్మా కొద్దిగా వండి విద్యార్థులకు సర్దుబాటు చేయడాన్ని గమనించారు. స్టీల్ పాత్రలు వాడకుండా సిల్వర్ పాత్రలు వంటల కోసం వాడటాన్ని గమనించి వంట ఏజెన్సీకి నోటీసులు అందించారు. పిల్లలతో మాట్లాడి వివరాలు సేకరించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనానికి వచ్చిన ఫిర్యాదు మేరకు పరిశీలించామని.. మరోసారి ఇలా జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంఈవోలు హెచ్చరించారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో లక్ష్మణరావు

నిరుపేద కుటుంబానికి అండగా..

వజ్రపుకొత్తూరు: పూడిజగన్నాథపురం గ్రామానికి చెందిన తిమ్మల అప్పలస్వామి ఇటీవల మృతి చెందారు. దీంతో నిరుపేద కుటుంబానికి చెందిన అప్పలస్వామి భార్య ధనలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు సమావేశం నిర్వహించి కొంత మంది దాతలు సహకారంతో రూ.1.65 లక్షలు సేకరించారు. ఈ మొత్తాన్ని ఇద్దరు చిన్నారుల పేరుపై స్థానిక ఇండియన్ పోస్టాఫీసులో సుకన్య సమృద్ధి యోజనం పథకంలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి మానవత్వం చాటుకున్నారు. సంబంధిత పత్రాలను కుటుంబ సభ్యులకు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు జి.ఆదినారాయణ, టి.గణపతి, డి.కోదండబరావు, బి.మోహన్, టి.సాంబమూర్తి, డి.సోమేష్, టి.జయరాం, డి.కూర్మారావు ఉన్నారు.



అప్పలస్వామి కుటుంబ సభ్యులకు డిపాజిట్ పత్రాలను అందజేస్తున్న దృశ్యం

అమరులను స్మరించుకోవాలి

సంతబొమ్మాళి: అమరులైన పోలీసులను స్మరించుకోవాలని ఏపీఎస్పీ డీఎస్పీ చంద్రశేఖర్ అన్నారు. దండుగోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా సంస్మరణ సభను బుధవారం నిర్వహించారు. విజయనగరానికి చెందిన ఏపీఎస్‌పీ ఐదో బెటాలియన్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. పాఠశాల పూర్వవిద్యార్థులైన కీర్తిశేషులు పొందల లక్ష్మణరావు, పొందల కష్టారావులు ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక సాయధ దళములో విధులు నిర్వహిస్తూ నక్సలైట్లతో పోరాడుతూ వీరమరణం పొందారు. ఈ సందర్భంగా వీరి సేవలను గుర్తు చేసుకున్నారు. ఏపీఎస్పీ డీఎస్పీ చంద్రశేఖర్, సబ్ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్ అమర జవాన్ల చిత్ర పటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీరభద్రరావు, భాస్కరరావు, ఆదికేశవరెడ్డి, లక్ష్మీకాంతం, తిరుపతిరావు, నాగేశ్వరరావు, లక్ష్మీపార్వతి, ఉమ, రాము, చిన్నారావు, విజయలక్ష్మి, శ్రీనివాసరావు, మార్కండేయులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న డీఎస్పీ చంద్రశేఖర్

తప్పులు సరిదిద్దుకోవాలి

సోంపేట: భూ రీ సర్వేలో తప్పులు జరిగి ఉంటే రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు అందజేసి సరిదిద్దుకోవాలని తహసీల్దార్ బి.అప్పలస్వామి రైతులకు సూచించారు. మండలంలోని రీసర్వే పూర్తయిన గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులో భాగంగా జింకిభద్ర గ్రామంలో రెవెన్యూ సదస్సు బుదవారం నిర్వహించారు. రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. సర్పంచ్ తామాడ పద్మావతి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు జుత్తు పురుషోత్తం, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి

కంచిలి: భూ రీసర్వే జరిగిన గ్రామాల్లో రైతులు రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎన్.రమేష్‌కుమార్ అన్నారు. మండలంలోని పెద్ద కొజ్జిరియా, చిన్న కొజ్జిరియా గ్రామాల్లో బుధవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. మండలంలో 57 రెవెన్యూ గ్రామాలు ఉండగా 35 గ్రామాల్లో సర్వే పూర్తి చేసినట్లు చెప్పారు. భూ వివరాల్లో తప్పులు ఉంటే రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి, మాదిన రామారావు, ఇప్పిలి కృష్ణారావు, కొనపల సురేష్, లడ్డుకేశవ్ పాత్రో, సర్పంచ్ పొందల ఢిల్లీరావు ఉన్నారు.



కంచిలి: రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన

కాశీబుగ్గ: మందస మండలంలోని పలు గ్రామాల్లో పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పలు అభివృద్ధి పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. హరిపురం, బైరిసారంగపురం, రాధాక్రిష్టాపురం, జిల్లుండ, కృషోణ్ణరం, చిన్న కోస్టా గ్రామాల్లో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మందస మండల అభివృద్ధి అధికారి పైల సూర్యనారాయణరెడ్డి, పంచాయతీ రాజ్ డీఈ రవిబాబు, పంచాయతీరాజ్ ఇంజినీర్ యామిని, ఆయా సచివాయాల సిబ్బంది పాల్గొన్నారు.



రాధాక్రిష్టాపురంలో రోడ్డు పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శిరీష

తుఫాన్‌పై అప్రమత్తంగా ఉండాలి

- ప్రత్యేకాధికారు శ్రీనివాసరెడ్డి, జగన్మోహనరావు

ఇచ్ఛాపురం రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన దానా తుఫాన్ పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారులు చల్లా శ్రీనివాస రెడ్డి, జగన్మోహనరావులు అన్నారు. మండలస్థాయి అధికారులతో ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గురువారం నుంచి భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ అధికారులు ప్రకటించిన నేపథ్యంలో సముద్ర, నదీ తీర ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే 17 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. అలాగే స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో తహసీల్దార్ ఎన్.వెంకటరావు, ఎంపీడీవో కె.రామారావు, గ్రామ సచివాయల సిబ్బంది పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం రూరల్: సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారులు

రైతులు, మత్స్యకారులకు సూచనలు

సోంపేట: తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో రైతులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారి బి.నర్సింహామూర్తి అన్నారు. తీర ప్రాంత పంచాయతీలైన సిరిమామిడి, ఉప్పలాం గ్రామాల్లో బుధవారం రైతులకు, మత్స్యకారులకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పలు సలహాలు, సూచనలు అందజేశారు. పంటలను జాగ్రత్తలతో సంరక్షించుకోవాలన్నారు. వరి పంటలో నీటిని తొలగించాలని సూచించారు. మత్స్యకారులు మూడు రోజులు వేటకు వెళ్లవద్దన్నారు. ఉప్పలాం సర్పంచ్ బట్టి మాధవరావు, వ్యవసాయ, ఉద్యాన, వైద్య, మత్స్య శాఖల సహాయకులు వ్యాస్, రాణమ్మ, షేఖ్ సైదాబి, ఎల్.కుమార స్వామి పాల్గొన్నారు.



సోంపేట: ఉప్పలాం తీరప్రాంతంలో మత్స్యకారులు, రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి

అందుబాటులో ఉండండి..

నందిగాం: తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో వీఆర్వోలు గ్రామాల్లో అందుబాటులో ఉండాలని తహసీల్దార్ పి.సోమేశ్వరరావు అన్నారు. తన కార్యాలయంలో వీర్వోలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. తుఫాన్ ప్రభావంతో వర్షాలు పడే అవకాశం ఉందని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. లోతట్టు ప్రాంత ప్రజల పట్ల అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు సమాచారాన్ని కార్యాలయానికి తెలియజేయాలని సూచించారు.

ఎల్ఐసీ ఏజెంట్ల నిరసన

కాశీబుగ్గ: సమస్యలను పరిష్కరించాలని ఎల్ఐసీ ఏజెంట్లు కోరారు. ఈ మేరకు స్థానిక భారతీయ జీవిత బీమా కార్యాలయం వద్ద బుధవారం నిరసన చేపట్టారు. 68 ఏళ్ల సంస్థ మనుగడ ప్రమాదంలో పడేలా యాజమాన్యం అనుసరిస్తోందని ఏజెంట్ల సంఘ అధ్యక్షులు జినగ రాజేంద్రనాయుడు అన్నారు. నిరసన కార్యక్రమంలో బ్రాంచ్ సెక్రటరీ ఎస్.నాగేశ్వరరావు, ట్రెజర్ బి.వాసుదేవ్, డివిజన్ వైస్ ప్రెసిడెంట్ ఈశ్వరరావు, అధికసంఖ్యలో ఏజెంట్లు పాల్గొన్నారు.

పోలీసులతో స్నేహ పూర్వకంగా మెలగాలి

టెక్కలి: పోలీసులతో స్నేహ పూర్వకంగా మెలగాలని టెక్కలి ఏఎస్ఐ ఎర్రన్నాయుడు అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీసుల గొప్పతనం, వారి సేవలను వివరించారు. ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ, వైస్ ప్రిన్సిపాల్ బి.సతీష్‌కుమార్, అధ్యాపకులు లీలపద్మజ, కోటేశ్వర్రావు, శ్రీనివాస్, శాంతన్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

కంచిలి: ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టిపెట్టాలని సంబంధిత సిబ్బంది అన్నారు. మండలంలోని ప్రకృతి వనరుల కేంద్రం బలియపుట్టుగలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. బ్రహ్మాస్త్రం, నీమాస్త్రం, జిల్లెడు ద్రావణం తయారీ విధానాన్ని వివరించారు. సిబ్బంది బి.పుష్పలత, బి.రోహిణి, జి.భవాని, జి.మీనా ఉన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో బాలికలపై అత్యాచారానికి ఒడిగట్టిన నిందితులను కఠినంగా శిక్షించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం అధ్యక్షురాలు జన్ని భాగ్యలక్ష్మి డిమాండ్ చేశారు. కాశీబుగ్గలో బుధవారం బాధిత బాలికల కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఒకే కుటుంబానికి చెందిన అక్కాచెల్లెళ్లపై అత్యాచారం చేయడం దారుణమన్నారు. వారికి న్యాయం చేయాలని, నిందితులను పోక్సో చట్టం కింద శిక్షించాలన్నారు. జిల్లాలో మత్తు పదార్థాలు, మద్యం విచ్చలవిడిగా పెరగడం వలన వాటికి యువకులు బానిసై మత్తులో విచక్షణ కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సంఘం కార్యదర్శి ఢిల్లీశ్వరి, సభ్యులు లావణ్య, జ్యోతి, రజని, గాయత్రి తరంగిణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భాగ్యలక్ష్మి

పిల్లలు బడిలోనే ఉండాలి

ఇచ్ఛాపురం రూరల్: బడిఈడు పిల్లలు కచ్చితంగా పాఠశాలలోనే ఉండేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ విజయరామరాజు, ఎస్‌పీడీ గరి శ్రీనివాస్ అన్నారు. ప్రత్యేక డ్రైవ్ చేపట్టి డ్రాపౌట్స్ విద్యార్థులను గుర్తించి బడిలో చేర్పించాలని సూచించారు. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో స్థానిక ఎమ్మార్సీలో బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉపాధ్యాయులతో ముఖాముఖి మాట్లాడారు. యూడైస్ అప్డేషన్, అపారలో 9, 10, ఇంటర్ విద్యార్థుల ఐడీని క్రియేట్ చేయాలని అన్నారు. ఈ నెల నుంచి స్కూల్ కాంప్లెక్స్ నిర్వహణ, రీ ఆర్గనైజేషన్ చేసినటువంటి కాంప్లెక్స్ పరిధిలో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఎంఈవో కురమాన అప్పారావు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

రచయిత్రి సాహూ సంధ్యకు సత్కారం

కవిటి: ఈ నెల 19, 20 తేదీలలో పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం బుద్ధాల కాన్వెన్సన్ హాల్‌లో అంతర్జాతీయ శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ ఆధ్వర్యంలో ప్రపంచ తెలుగు సాహిత్య–కళాజాతర జరిగింది. ఇందులో కవిటి మండలం మాణిక్యపురం గ్రామానికి చెందిన అభ్యుదయ రచయిత్రి సాహు సంధ్య సాహిత్య ప్రదర్శన ఇచ్చారు. 24 గంటల 24 నిమిషాల పాటు ఆమె నిర్విరామంగా ప్రదర్శన ఇవ్వడంతో ఆమెను నిర్వాహకులు సత్కరించి గౌరవించారు.



సాహూసంధ్యను సత్కరిస్తున్న దృశ్యం